క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలపై వ్యాసరచన పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నగరి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు టి.ధణి నాణ్యతా ప్రమాణాలపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నాణ్యతా ప్రమాణాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు, తద్వారా సమాజానికి చేరవేయడమే వ్యాసరచన పోటీల ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. పోటీలో ప్రథమ బహుమతి పొందిన వారికి రూ.1000, ద్వితీయ బహుమతి పొందిన వారికి రూ.750, తృతీయ బహుమతిగా రూ.500 చొప్పున నగదు బహుమతి అందజేయగా కన్సొలేషన్ బహుమతిగా రూ.250 అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కళ్లను పరీక్షిస్తున్న శంకర్ నేత్రాలయ సిబ్బంది

కార్వేటినగరం: రాష్ట్రీయ సేవాసమితి చొరవతో మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం గురువారం మండల పరిధిలోని డీఎం పురం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం అన్నారు. ఈ సందర్భంగా రాస్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ చెన్నైవారి సహకారం ఏర్పాటు చేసి ఉచిత వైద్యపరీక్షలకు 160 మంది హాజరయ్యారని వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందులో 18 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారికి చైన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తామన్నారు. కంటి చూపు తగ్గిన వారు ఆలస్యం చేయకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్ మాట్లాడుతూ రాస్ కార్యక్రమాలు ఆదర్శవంతమని, వారు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాస్ అధికారులు నాగరాజు, రవి, ప్రకాష్, భారతి, సుజాత, గౌరి, మునివేలు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ



ప్లేట్లు అందజేస్తున్న దాతలు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె ప్రాథమి పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న పూజశ్రీ పుట్టిన రోజు సందర్భంగా గురువారం పిల్లలకు ఉచితంగా స్టీలు ప్లేట్లను వితరణ చేశారు. పూజశ్రీ తల్లిదండ్రులు తులసి, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లేట్లు అందజేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనందరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం పూడి రోడ్డులోని సుధాకర్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం తిరుపతి విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రూ.1.60 లక్షల విలువ చేసే 4,400 కేజీల రేషన్ బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు స్వాధీన పరిచారు. మిల్లు యజమాని కె.ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఆవిష్కరించారు. ఇందులో రచించిన భావనారాయణాచార్యులు ×విమానార్చన కల్పం×, మల్లాది సూరిబాబు రచించిన ×అన్నమయ్య సంకీర్తనా కౌముది×, ఆర్‌వీ కమలకణ్ణన్ రచించిన ×రామనాటక కీర్తనై× (తమిళం) ఉన్నాయి. ఇందులో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేఈఓ సదాభార్గవి, సీవీఎస్వో నరసింహకిషోర్, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, ఉపసంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో 'ఆమె' కీలకం

- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌కు ఆమోదం
- ఇప్పటికే అన్నిరంగాల్లో రాణిస్తున్న అతివలు
- ఇకపై చట్టసభల్లో గళం వినిపించనున్న మహిళాలోకం



పుత్తూరు రూరల్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్త మవుతోంది. మహిళా బిల్లు ఆమోదం పొందడం ద్వారా దేశాభివృద్ధిలో మహిళలు మరింత చురుకైన పాత్ర పోషించనున్నారని పలువురు మహిళలు చెబుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల తర్వాత మహిళలకు చట్ట సభల్లో సముచిత స్థానం లభిస్తోందని అంటున్నారు. మహిళల పట్ల హింసాకాండ, అణచివేతలకు చరమగీతం పాడి, మహిళా హక్కులు, వారి రక్షణ పట్ల చట్టాలు చేసుకునే వెసులుబాటు కలిగిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త పార్లమెంటు భవనంలో తొలి బిల్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం మహిళా విజయంగా అభివర్ణిస్తున్నారు.

దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర..



దేశ రాజకీయాల్లో ఇకపై మహిళలు చురుకైన పాత్ర పోషించనున్నారు. 'నారీశక్తి వందన్ అధినియమ్' అన్న పేరుతో స్త్రీ జాతి గౌరవాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్వతంత్ర భారతావనిలో పురుషాధిక్యతతో పాటు ఇక లింగ బేధానికి చరమగీతం పాడినట్లే. అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా బిల్లు ఆమోదించడం ద్వారా దేశ ఐక్యత ప్రతిబింబించింది.

- డాక్టర్ కె.శ్రీదేవి, ఇంగ్లీష్ అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

చారిత్రక ఘట్టం..



చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చడం చారిత్రక ఘట్టం. మహిళలకు వంటిళ్ల సంకెళ్ల నుంచి విముక్తి కల్పించి చట్టసభల వైపు నడిపిస్తున్న భారతావని ప్రపంచానికి మార్గదర్శకం. ఈ బిల్లు ద్వారా మహిళల స్థాయి, గౌరవం పెరగడంతో పాటు రాజకీయ సాధికారితకు తొలి అడుగు పడిందనడంలో సందేహం లేదు.

- పి.అమ్ముదేవి, తమిళ్ అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పుత్తూరు

ఆత్మ గౌరవం పెరిగింది



చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజరేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడం ద్వారా మహిళల్లో ఆత్మ గౌరవం పెరిగింది. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా ఇది మహిళా విజయంగా భావిస్తున్నాను. మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం కేటాయించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించారు. దాదాపు ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా ఖ్యాతి గడించారు.

- జయలక్ష్మి, కౌన్సిలర్, పుత్తూరు మున్సిపాలిటీ

అక్రమాలకు అడ్డుకట్ట..



స్వతహాగా మహిళలు అక్రమాలకు, అవినీతికి, దౌర్జన్యాలకు దూరంగా ఉంటారు. ఇలాంటి వారు చట్ట సభల్లో పెద్ద సంఖ్యలో ప్రాతినిథ్యం వహించడం ద్వారా అక్రమాలు, అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు. తద్వారా దేశాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారు. ఇందుకు అనుగుణంగా నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ తీసుకురావడం హర్షణీయం.

- ఎం.లహరి, స్టూడెంట్, సెకండ్ ఇయర్, బీకాం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

భవిష్యత్ మహిళలదే..



భవిష్యత్ దేశ రాజకీయాలను మహిళలే శాసించనున్నారు. చట్టసభల్లో ప్రస్తుతం ఉన్న 13.3 శాతం ఉన్న రిజర్వేషన్లు 33 శాతానికి పెంచడం ఇందుకు నిదర్శనం. ప్రస్తుత లోక్‌సభలో 542 సీట్లకు కేవలం 78 మంది మాత్రమే మహిళా ఎంపీలు ఉన్నారు. రాజ్యసభలో 224 సీట్లకు గాను 24 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. రానున్న రోజుల్లో అన్ని చట్టసభల్లో కూడా మహిళలు ఎక్కువ ప్రాతినిథ్యం వహించే అవకాశం ఉంది.

- వాసవి, స్టూడెంట్, థర్డ్ ఇయర్, బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

సమానత్వానికి స్వాగతం..



స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా సమానత్వానికి నాంది పలుకుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, అందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. దేశ రాజకీయాల్లో మహిళలు మరింతగా రాణించి, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నారు. ఇది దేశానికే గర్వకారణం.

- డాక్టర్ పి.గాయత్రి, గణిత అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

నాడు దోచేసి.. నేడు శ్రీరంగనీతులా ?



గాలి భానును హెచ్చరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- గాలి భానుపై మున్సిపల్ చైర్మన్ హరి ఫైర్

పుత్తూరు రూరల్: నగరి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగలెత్తింది ×గాలి× కుటుంబమేనని, ఆధారాలు లేకుండా మంత్రి రోజమ్మ మీద నిందారోపణలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఫైర్ అయ్యారు. గురువారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి రోజాపై నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మంత్రి రోజా ఆస్తుల గురించి మాట్లాడే ముందు గతం ఏంటో తెలుసుకోవాలని, ఆమె సినీ రంగంలో అగ్ర కథానాయికగా వెలుగొందారని, ఆమె భర్త సెల్వమణి ప్రముఖ దర్శకుడని తెలిపారు. కానీ మీ తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు లెక్చరర్‌గా నెల జీతానికి పనిచేసిన విషయాన్ని మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి మంత్రి కాగానే ఏర్పేడు వద్ద భారీ గోడౌన్లు ఎలా నిర్మించారని ప్రశించారు. బినామీ పేర్లతో రూ.100 కోట్లకు పైగా పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి కోట్లు దోచేయలేదా అంటూ ప్రశ్నించారు. అవినీతికి సాక్ష్యంగా ట్యాంకు కట్ట కుంగిపోతే కనీసం అటువైపునకు వచ్చి చూసిన పాపాన పోలేదని ఆరోపించారు. తిరుపతి పద్మావతిపురంలోని తమరి ఇంటిని రాయపాటి సాంబశివరావు ఎందుకు నిర్మించి ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమరి లిక్కర్ లారీలను అధికారులు పట్టుకుంటే మీ పేరు బయటకు రాకుండా పడిన పాట్లు అందరికీ తెలిందేనన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.371 కోట్లు దోచేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును సీఐడీ పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారని చెప్పారు. చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని ఏ ఒక్క టీడీపీ నాయకుడు చెప్పడం లేదని, గవర్నర్ దగ్గర పర్మిషన్ తీసుకోలేదని, ఇన్‌టైమ్‌లో కోర్టులో ప్రవేశ పెట్టలేదని వాదిస్తున్న లాయర్ల తీరును బట్టే అవినీతిలో టీడీపీ స్కిల్ బట్టబయలు అవుతోందని చెప్పారు. చంద్రబాబు అవినీతిని రాష్ట్ర ప్రజలందరూ ఛీదరించుకుంటున్నారని, సిగ్గులేకుండా కాపాడాలంటూ గుళ్లలో పూజలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ డిపాజిట్లు కోల్పోవడం తథ్యమని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఆరేటమ్మ ఆలయ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలాజీ, జానకెనడీ, చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథరెడ్డి, జయబాబు, మునిరత్నం, రవిశంకర్‌వర్మ, రాజాప్రవీణ్, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ పుత్రునికి ప్రత్యేక పూజలు





గాండ్లమిట్ట కూడలిలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు, శివాలయం వీధిలో అన్నదానం చేస్తున్న యువత

కార్వేటినగరం: చవితి వేడుకలను పురస్కరించుకుని మేజర్ పంచాయతీ కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి, శివాలయం వీధుల్లో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా శివాలయం వీధిలో ఉన్న గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టి యువత ఆధ్వర్యంలో ఐదు వందల మందికి అన్నదానం చేపట్టారు. అలాగే ఐదోరోజు స్వామివారి నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

పవర్‌లూమ్స్ కార్మికులకు పింఛన్ ఇవ్వండి



సీఈఓ ఇంతియాజ్‌కు నివేదిక అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, నాయకులు

పుత్తూరు రూరల్: నగరి నియోజకవర్గంలో 50 ఏళ్లు నిండిన పవర్‌లూమ్స్ కార్మికులు దయనీయ స్థితిలో ఉన్నారని, వీరికి పెన్షన్లు మంజూరు చేయాలని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలో ఏఎండీ ఇంతియాజ్, సీఈఓ (సెర్ప్)కు మంత్రి రోజా నేతృత్వంలో పుత్తూరు సెంగుంధర్ మక్కల్ నల సంఘం నాయకులు నివేదిక అందజేశారు. నేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న సుమారు 200 మంది కార్మికులు ఒకటి, రెండు మగ్గాలతో సరిపడ ఆదాయం లేక కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. వీరంతా కరోనా మహమ్మారి కారణంగా జీవనోపాధి కోల్పోయారని స్పష్టం చేశారు. ప్రస్తుతం వీరంతా 50 ఏళ్లు పైబడి వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వీరి దయనీయ స్థితిని గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు మంత్రి రోజా ఇచ్చిన లేఖను సీఈఓకు పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్, సెంగుంధర్ మక్కల్ నల సంఘం నాయకులు శివశంకర్, గోపిరమణ, ఏకాంబరం, దిలిప్‌మొదలి అందజేశారు.

డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం



గాంధీనగర్‌లో తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని కేసీ పల్లి రోడ్డులోని గాంధీనగర్ గ్రామానికి తాగు నీటి దాహార్తిని తీర్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆ గ్రామస్తులు అన్నారు. గురువారం తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా తాగునీటి కోసం ఇబ్బందులు తరుణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రికి గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, తమకు బోరు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనతికాలంలోనే బోరు ఏర్పాటు చేసి తాగునీటిని అందించిన మంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్ఎం మనోహర్‌నాయుడు సేవలు ఎనలేనివి



రాష్ట్ర ఉత్తమ హెచ్ఎం అవార్డు గ్రహీత మనోహర్ నాయుడును సన్మానిస్తున్న ఎంఈఓ, టీచర్లు

పాలసముద్రం : ఉత్తమ బోధనలు అందించి విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న హెచ్ఎం మనోహర్‌నాయుడు సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ అవార్డు అందించడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌బాబు తెలిపారు. గురువారం బలిజకండ్రిగ హైస్కూల్ ఆవరణలో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు దేవరాజులు రెడ్డి, ఎంఈఓ గిరిజ సమక్షంలో అవార్డు గ్రహీత మనోహర్‌నాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవరాజులు రెడ్డి మాట్లాడుతూ హెచ్ఎం మనోహర్ నాయుడు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ హెచ్ఎంగా అవార్డు వచ్చిందన్నారు. ఉదయం పాఠశాలకు వచ్చినప్పటి నుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు తీసుకోవాలంటే అసామాన్య పనికాదన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల బృందం సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వినాయకం, పాఠశాల స్థలదాత మునిరత్నంనాయుడు, హెచ్ఎంలు మీనాక్షి, దీన్‌దయాల రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలతో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం

పుత్తూరు రూరల్: చిరుధాన్యాలు వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చిరుధాన్యాల ఉపయోగాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలని సూచించారు. పోటీల్లో రాచపాళెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.అఖిల్ ప్రథమస్థానం, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి కె.గౌతమ్ ద్వితీయ, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ టి.ప్రియ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రకటించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శుక్రవారం తిరుపతి ఎస్వీయూలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కె.అఖిల్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, బాలికల పాఠశాల హెచ్ఎం భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుత్తూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం వడమాలపేట మండలం తడుకు రైల్వే క్రాస్ వద్ద నేషనల్ హైవేపై ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. నగరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివయ్య మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయపురం (నగరి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సోమశేఖర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులతో జ్వరం, జలుబు, దగ్గు వస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రాత్రిపూట దోమతెర వాడాలన్నారు. ప్రధానంగా చిన్న పిల్లలకు జ్వరం వస్తే వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. సొంతంగా మందులు తీసుకోవడం మంచిది కాదన్నారు. అలాగే స్థానిక ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పాటించేలా చూడాలన్నారు.

నేటి యువతకు గురజాడ స్ఫూర్తి



నగరి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

కార్వేటినగరం: దేశమంటే మట్టికాదోయ్..దేశమంటే మనుషులోయ్.. వట్టి మాటలు కట్టిపెట్టి.. గట్టిమేలు తలపెట్టవోయ్ అన్న గురుజాడ అప్పారావు మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. గురువారం తెలుగు గద్యతిక్కనగా పేరుగాంచిన గురుజాడ అప్పారావు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ గురుజాడ అప్పారావు సమాజానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకంతో స్త్రీల హక్కుల గురించి ఆనాడే సమాజానికి గుర్తు చేశారన్నారు. సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన వారిలో గురుజాడ ప్రథముడని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీఎన్ లత, జోగి ప్రసాద్, కార్తీక్, లావణ్య, జేకేసీ మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

గురజాడ రచనలతో చైతన్యం

వెదురుకుప్పం: సామాజిక స్పృహ కలిగిన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం వైపు తీసుకెళ్లాయని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నవయుగ వైతాళికుడు గురజాడ తన రచనల ద్వారా దేశభక్తిని చాటుకున్నారన్నారు. బాధ్యత గల పౌరుడిగా గురజాడ సమాజాన్ని ఉద్ధరించే రచనలను రచించినట్లు గుర్తు చేశారు. ఒక వైపు విజ్ఞానం సమాజాన్ని నడిపిస్తుంటే మరో వైపు మూఢనమ్మకాలు తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. వందేళ్లు అవుతున్నా నేటికీ గురజాడ రచనలు సమాజాన్ని నడిపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదన్నారు. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షుడు భీమమోహన్‌రావు మాట్లాడుతూ కన్యాశుల్కం లాంటి దురాచారాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్న రోజుల్లో నిస్వార్థంగా దేశాన్ని ప్రేమిస్తున్నానంటూ సమాజానికి సందేశాన్నిస్తూ సమాజ ఉద్ధరణకు వందల ఏళ్లు గుర్తుండేలా రచనలు చేసినట్లు తెలిపారు. ఆయన రచనలు సంఘసంస్కర్తలు, రచయితలు, బాధ్యత గల పౌరులకు ఆదర్శంగా నిలిచిపోయేలా ఉందన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరి/పుత్తూరురూరల్: సంఘ సంస్కరణలో గురుజాడ పాత్ర కీలకమని నగరి, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆయా కళాశాలల్లో గురజాడ వెంకట అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాతృభాషను సంస్కరించడంతో పాటు ఆనాటి సమాజాన్ని సంస్కరించడానికి గురజాడ చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సి.చిన్న పాపమ్మ ఆనాటి స్త్రీ జనోద్ధరణకు గురజాడ పాటుపడిన విధానాన్ని వివరించారు. కన్యాశుల్కం నాటక ప్రదర్శన ద్వారా ఆనాటి సమాజాన్ని గురజాడ చైతన్య పరచిన తీరు ప్రసంశనీయమన్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ వరలక్ష్మి గురజాడ రచించిన పలు రచనలను సంక్షిప్తంగా సమీక్షించారు. అధ్యాపకురాలు డాక్టర్ అరుణకుమారి, జ్యోతి, వెంకటేశన్, ధర్మారావు, దేవకి, వాసవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు



పుత్తూరు : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి